

ప్రజలకు ఇబ్బంది కలుగనీయకూడదు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని మాలన్‌గొంది గ్రామానికి వెళ్లే రహదారి, వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కొంత మేరకు తెగి పోవడంతో అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఈఈ అజ్మీర కృష్ణ, తహసీల్దార్ రియాజ్ అలీ ఉన్నారు.

108లో ప్రసవం

వాంకిడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓ గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుడగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించగా తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. గురువారం తెల్లవారు జామున వాంకిడి మండలం బంబార గ్రామానికి చెందిన ఎరగతి లలితకు నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. మంచిర్యాలకు తరలిస్తున్న మార్గ మధ్యలో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ ప్రవీణ్, పైలేట్ శ్రీనివాస్‌లు తెలిపారు. అనంతరం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించినట్లు వారు తెలిపారు.

హామీ విస్మరిస్తే పోరాటమే

కెరమెరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదని పీఆర్టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, శివప్రసాద్, ప్రకాష్‌ల అన్నారు. గురువారం సీపీఎస్ వ్యతిరేక మహాధర్నా పోస్టులను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సంద ర్భగా ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్‌కు మార్, సోము, ప్రకాష్, ప్రత్యూష, మౌనిక పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు
ఏర్పాట్లు పూర్తి



స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ము స్తాబైంది. వేడుకలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వేడుకలకు ము ఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ హాజరు కానున్నారు. వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథి బండ ప్రకాష్ గౌరవ వందనం స్వీకరించనుండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఏర్పాటు పనులను గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌లు పరిశీలించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన అధికారులకు వేడుకల సందర్భంగా అవార్డులు ప్రదానం చేయనుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేస్తారు. 9.40 గంటలకు పోలీసుల గౌరవ వం దనం స్వీకరించి ప్రసంగిస్తారు. అ నంతరం అత్యుత్తమ సేవలు అందిం చిన వారికి ప్రశంసాపత్రాలను అందజేసి విద్యార్థులచే నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు రోజుల్లో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, పోలీసు ఉన్నతాధికారులతో వర్ష పరిస్థితులలో ప్రజారక్షణ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాతావరణ సూచన మేరకు వచ్చే మూడు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో రానున్న 24 గంటలు మరింత కీలకమైన సమయమని అన్నారు. ప్రజల రక్షణ దిశగా అధికార యంత్రాంగం ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను వాహనదారులను అటు వైపుగా వెళ్లకుండా సిబ్బందితో పహారా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించామని తెలిపారు. సెలవులలో ఉన్న అధికారులు, సిబ్బందిని సెలవులు రద్దు చేసి వెనక్కి పిలిపించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, దహెగాం మండలాల్లో కురిసిన భారీ వర్షం కారణంగా వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. 13 లోలెవల్ కాజ్‌వేల వద్ద బందోబస్తు నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు, నీటి పారుదల శాఖ ఈఈ గుణవంతరావు, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోడు భూముల రైతుల తరలింపు ఉద్రిక్తం

- ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పోలీసుస్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన



బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కౌటాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల రైతుల తరలింపుపై కౌటాలలో ఉద్రిక్తత నెలకొంది. పోడు భూములు అటవీ అధికారులు తీసుకోకుండా తమకు దక్కేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఎనిమిది రోజులుగా పాదయాత్ర చేస్తున్న కుమరం భీం జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామస్థులను గురువా రం పోలీసులు అల్వాల్ సమీపంలో అరెస్టు చేశారు. అరెస్టు చేసి గ్రామస్థులను స్వగ్రామానికి ప్రత్యేక బస్సుతో తరలిస్తుండగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాగజ్‌నగర్ సమీపంలో పోడు రైతులను తీసుకువస్తున్న వాహనాన్ని అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు రోడ్డుపై బైఠాయించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కౌటాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోడు రైతులను కొందరిని ఆసిఫాబాద్, వాంకిడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు కౌటాల పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. వాళ్లను పోలీసులు గేటు బయట నిలిపివేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కుమరం భీం చౌరస్తా లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సాయంత్రం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు వదిలి పెట్టారు. మరో వైపు తమ ఊరి వాళ్లను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిన దిందా గ్రామస్థులు అక్కడికి చేరుకునే ప్రయత్నం చేయగా పోలీసులు ముందు జాగ్రత్తగా వారిని గ్రామ పొలిమే రలో నిలిపి వేశారు. సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై నగేష్, కమలాకర్, విజయ్, సాగర్ బందో బస్తు నిర్వహించారు. సాయంత్రం వరకు పోడు రైతుల విషయంలో పోలీసులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం దిందాకు చెందిన పోడు రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డాడానగర్ చౌరస్తాలో గురువారం రాస్తారోకో చేపట్టారు. పోడు సమస్యను పరిష్కరించాలని దిందాకు చెందిన పోడు రైతులు గత పది రోజుల క్రితం కాలినడకన ఛలో హైదరాబాద్‌కు వెళ్లుతుండగా గురువారం హైదరాబాద్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. దిందాకు కాగజ్‌నగర్ డాడానగర్ మీదుగా తరలిస్తుండగా, వీరికి న్యాయం చేయాలని వాహనాన్ని అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌటాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ శ్యాంరావు, ముస్తాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): గ్రామ పోడు రైతుల పాదయాత్రలో భాగంగా హైదరాబాద్ సమీపంలో అరెస్టు చేసి పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. పోడు రైతులను గ్రామానికి పోలీసులు తీసుకొస్తున్నారన్న వారికి మద్దతు ఇవ్వడానికి వెళ్ల కుండా అడ్డుకున్నారు. ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో అడ్డుకున్నట్లు గ్రామస్థులు వాపోయారు.

సంక్షిప్తం..

జైనూర్, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా జైనూర్‌లో యురియా కోసం రైతులు గురువారం వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

లింగాపూర్ (ఆంధ్రజ్యోతి): రైతు ఆగ్రో కేంద్రాలను వ్యవసాయశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ సందర్శించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్మ పున్నం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ వేడుకలను నిర్వహించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో గురువారం సామాజిక సంక్షేమ భవనాలను, పాఠశాలలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆజ్మీర శ్యాంనాయక్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే నివాసం వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు రావడంతో న్యాయమే గెలిచిందన్నారు. అధికార పార్టీ కక్ష్య సాధింపు రాజకీయాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఆలీబీన్ ఆహ్మద్, కార్నాథం సంజీవ్, పార్టీ మండల అధ్యక్షుడు జాబరి రవిందర్, బీఆర్ఎస్ నాయకులు నిసార్, ఆహ్మద్, సిహెచ్ రవి, జావిద్, భీమేష్, ఖాసీం, శ్రీనివాస్, హిమ్రే సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ నాయకులు ఆత్రం శంకర్, కుంర శాంరావ్, మడావి భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



కాగజ్‌నగర్‌లో బైక్ ర్యాలీ చేపడుతున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం బీజేపీ పార్టీ, ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణ పలు వీధుల మీదుగా సాగింది. . కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆర్మీ శివ, వీరభద్రచారి, అరుణ్ లోయా, పుల్ల ఆశోక్, శ్రీదేవి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా జెండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటిపై జెండా ఎగరవేయాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్ మండల్, గణేష్ రస్తాన్, సీఆర్పీఎఫ్ రవీందర్రసేమ్, దండెర పోశన్న, జగదీష్ తివారి మండల్, దశరథ్, చక్రవర్తి, పూజారి కిష్టయ్య, సత్తయ్య, కిన్నెర సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం...

జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకుల దుర్మరణం లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఇటిక్యాలలో విషాదం


అనిల్, గణేశ్(ఫైల్)

లక్షెట్టిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రాణ స్నేహితులు. చిన్నప్పటి నుంచి ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. చివరికి విధి కూడా వీరి స్నేహాన్ని దూరం చేయలేకపోయింది. జగిత్యాల జిల్లాలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణ స్నేహితులిద్దరూ తుది శ్వాస విడిచారు. ఒకేసారి మృత్యు ఒడికి చేరడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాలకు చెందిన ముచ్చకుర్తి అనిల్(26), మేడి గణేశ్(26) అనే ఇద్దరు యువకులు చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులు. అనిల్ ఇటీవలే పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించి రామగుండం కమిషనరేట్‌లో విధులు చేపడుతున్నాడు. గణేష్ హైదరాబాద్‌లోని వండర్‌లాలో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ సంతోషంగా జీవితాన్ని సాగిస్తున్నారు. ఇద్దరూ బుధవారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. రాత్రి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్టీసీ బస్సు మృత్యువు రూపంలో వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరివీ నిరుపేద కుటుంబాలే. ముచ్చకుర్తి పద్మ, మల్లయ్యలకు ముగ్గురు పిల్లలు. అందులో పెద్దకుమారుడు అనీల్. పద్మ మల్లయ్యలు జీవనోపాధి నిమిత్తం ముంబాయిలో కూలి పని చేసి పిల్లలను చదివించారు. అనిల్ ఇటీవలే కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడంతో కష్టాలన్నీ దూరం అయ్యాయనుకున్నారు. అంతలోనే విధి వీరి సంతోషాన్ని దూరం చేసింది. ఇక గణేష్ తల్లిదండ్రులు మేడి రాజయ్య, లక్ష్మవ్వలకు ఇద్దరు కుతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లేక లేక పుట్టిన సంతానం కావడంతో గణేశ్‌ను ఇంట్లో గారాబంగా చూసుకునేవాళ్లు. రోడ్డు ప్రమాదం రూపంలో వీరిద్దరూ దూరం కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చేతికి అందిన ఇద్దరు కొడుకులు చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

పోలీసు అధికారుల నివాళి..

ఇటీవలే పోలీస్ ఉద్యోగం సంపాదించిన ముచ్చకుర్తి అనిల్(28) ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ధర్మారంలో విధులు చేపడుతున్నాడు. మృతుడు అనీల్ అందరితో మంచి కలివిడిగా ఉండే వాడు. ఎప్పుడు అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ కలివిడిగా ఉండేవాడు. అనీల్ మృతి తీరని లోటు అంటూ తనతో పాటు విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది కన్నీటి పర్యంతం అయ్యారు. ధర్మారం ఎస్సై ముత్తె ప్రవీణ్ కుమార్, లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్, పోలీసుల సంఘం అధ్యక్షుడు పోషమల్లుతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాతా శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమని ఆసుపత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన

బెల్లంపల్లి,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో నవ జాత శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ గురువారం ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం కుమరం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలానికి చెందిన కిరణ్ అతని భార్య సువర్ణ గర్భిణి కావడంతో బుధవారం రాత్రి ప్రసవం కోసం బెల్లంపల్లిలోని వందపడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ చేస్తామని చేర్చుకున్నారు. వైద్యులు ఆపరేషన్ చేసి బాబు ను బయటకు తీశారు. కానీ అప్పటికే శిశువు మృతి చెందాడని వైద్యులు కుటుంబ సభ్యులతో వెల్లడించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు పుట్టి చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆగ్ర హం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. బాబు మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని సముదాయించి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.


ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

స్వాతంత్రోద్యమంలో బీబ్రా ప్రస్థానం

- నాడు ఘనం. నేడు కళావిహీనం
- ఆదరణలేక మరుగున పడుతున్న చరిత్ర
- తొలి జెండా ఇక్కడే ఆవిష్కరణ


దహెగాం మండలం బీబ్రాలో స్వాతంత్ర్యోద్యమ కాలంలోని పోలీసుస్టేషన్ భవనం


బీబ్రా గ్రామంలోని జెండా గద్దె

దహెగాం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో మండలంలోని బీబ్రా గ్రామానికి ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలోని అతి మారు మూల జిల్లా కుమరం భీం ఆసిఫాబాద్. పోరాటాల ఖిల్లాగా సరిహద్దన పెద్దవాగు, ప్రాణహి తలే సరిహద్దులుగా... పచ్చని పైర్ల మధ్య కళకళలాడే దహెగాం మండలంలోని అతి చిన్న గ్రామం బీబ్రా. ఈ గ్రామానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉన్నా ఆదరణ లేక నేడు బాహ్యప్రపంచానికి తెలియకుండా పోతోంది. భారతదేశానికి 1947లో స్వాతంత్యం వచ్చినప్పటికీ ఒక్కటైన హైదరాబాద్ రాష్ట్రం మాత్రం నిజాం సర్కార్ ఆధీనంలో ఉండడంతో స్వేచ్చను పొందలేక పోయారు. కానీ భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో బీబ్రా గ్రామంలో నిజాం పోలీసుస్టేషన్ ఉన్నప్పటికీ గ్రామానికి చెందిన బండ మల్లయ్య, గాండ్ల బాపు, తంగిపెల్లి జగ్గయ్య, తనుకు చంద్రయ్య, నాయికిని భీమయ్యతో పాటు మరికొందరు గ్రామస్థులు ఒకవైపు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనే మరోవైపు స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్రను పోషించారు.

● పెద్దవాగు ఒడ్డున

బీబ్రా గ్రామంలో నిజాం కాలంలో పోలీ సుస్టేషన్ పెద్దవాగు ఒడ్డున విశాల ప్రదేశంలో నిర్మించారు. దీని నిర్మాణంలో ఇటుకలు, ఇనుప పట్టీలు పెద్ద పెద్ద రాళ్లతో పాటు డండు సున్నంతో నిర్మించడంతో నేటికీ దీని నిర్మాణం చెక్కు చెదరకుండా ఉంది. పెద్ద వాగు వరదల కారణంగా దీనికి వేరే చోటికి మండల వ్యవస్థ ఏర్పడ్డాక దీనిని దహెగాంకు తరలించారు. అలాగే జాతీయ జెండా గద్దె వినియోగించిన కర్ర కూడా నేటికీ సజీవ సాక్ష్యాలుగా చరిత్రను గుర్తు చేస్తున్నాయి. కానీ గతెంతో ఘనంగా దేశ చరిత్రపుటల్లో తమ కంటూ ఓ పేరును లిఖించుకున్న బీబ్రా గ్రామం నేడు కళావిహీనంగా మారింది. బీబ్రా గ్రామంలో ఉన్న పోలీసుస్టేషన్ నేటి దహెగాం, భీమిని, కన్నెపల్లి, బెజ్జూరు, పెంచికలపేట తదితర మండలాలకు చెందిన సుమారు 100పైగా గ్రామాలు ఈ పోలీసు స్టేషన్‌పరిధిలో ఉండేవి. గ్రామంలో మార్వాడీలు, వైశ్యు లు పెద్ద మొత్తంలో వస్త్ర, వ్యాపారరంగాలలో ఉండే వారు. ఈ గ్రామం విశాలంగా ఉండి గ్రామంలో వార సంత కూడా ఉండేది. దీంతో ఎలాంటి అవసరాలకైనా బీబ్రా గ్రామానికి నిత్యం చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు మంది వివిధ పనుల నిమిత్తం రాక పోకలు సాగిం చేవారు. కాగజ్‌నగర్ పట్టణ శివారులో పెద్దవాగు రైల్వే వంతనను కూడా బీబ్రా బ్రిడ్జిగానే నేటికీ చెబుతుండడం గమనార్హం.

● అర్ధరాత్రి జెండా ఆవిష్కరణ..

దేశానికి స్వాతంత్ర్యం రాగానే స్థానిక నిజాం పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించింది. దీంతో స్థానిక స్వాతంత్ర్యోద్యమకారుడి ఇంటివద్ద గ్రామం నడిఒడ్డున అప్పటికప్పుడు జెండా గద్దెను నిర్మించారు. ఈ మేరకు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అప్పటి నుంచి నేటి వరకు కూడా అదే చోట గ్రామంలో మొట్టమొదటి (ఆగస్టు 15, జనవరి 26)జెండాను ఆవిష్కరిస్తారు. ఆ తరువాతనే వేరేచోట్లలో జెండాను ఆవిష్కరించడం ఈ గ్రామంలో అనవాయితీగా వస్తోందని చెబుతున్నారు. కాగా ఈ జాతీయ జెండాను మొదటగా గ్రామానికి చెందిన బండ మల్లయ్య అనే వ్యక్తి ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు సుదర్శన్(వామన్) ఎగురవేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఎరువుల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఎరువుల వాహనం

కోటపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నూ రు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా బొలేరో వాహనంలో తరలిస్తు న్న ఎరువులను గురువారం మండలంలోని రాపన్‌పల్లి చెక్‌పో స్టు వద్ద పట్టుకున్నట్లు చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ తెలిపారు. కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్ తన సిబ్బందితో కలిసి రాపన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎరువులతో అక్రమంగా తరలుతున్న బొలేరో వాహనం పట్టుబడిందన్నారు. ఇందులో 30 యూరియా బస్తాలు, 32 డీఏపీ బస్తాలు ఉన్నాయని , ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. బొలేరో వాహనం (టీఎస్19టీఏ3871)లో చెన్నూర్ మండలం లోని రాయిపేటకు చెం దిన గోగు రాజమల్లు వీటిని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. దీనిపై వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తనిఖీలు చేసి ఎరువులను చెన్నూరు పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్ దుకాణం నుంచి అనాధారిత బిల్లు పేరిట కొనుగోలు చేసినట్లు గుర్తించారన్నారు. దీంతో 62 యూరియా బస్తాలను , అక్రమంగా తరలిస్తున్న బొలేరో వాహనం డ్రైవర్ గోగు రాజమల్లు, సంబంధిత ఫెర్టిలైజర్ షాపు యాజ మాని బాపురెడ్డిపై కేసు నమోదు చేసి వాహనంతో పాటు 62 బస్తాలను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఎస్‌ఐ రాజేందర్, ఏవో సాయికృష్ణరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు

ఎవరైనా యూరియా బస్తాలను వేరే ప్రాంతాలకు అక్రమంగా తరలించి అక్రమార్జనలకు పాల్పడితే వారిపై చట్టరీత్య చర్యలు తప్పవని చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా స్థానిక రైతులకు యూరియా బస్తాలు అందకుండా వేరే ప్రాంతాలకు తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజక్టులలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేశారు. కుమరంభీం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 243 మీటర్లకు గాను ప్రస్తుతం 237మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 3611 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి 3,014 క్యూ సెక్కుల వరద నీటిని బయటకు వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 239.5 మీటర్లకు 238.30 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 2,700 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి వేయి క్యూసెక్కుల వరద నీటిని బయటకు వదులుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

హాజీపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలీవాగు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు గురువారం మృతి చెందాడు. హాజీపూర్ ఎస్‌ఐ స్వరూప్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం కోటపల్లి మండలం దేవునిగూడెం గ్రామానికి చెందిన నిట్టూరి శశిపాల్(36) నడుచుకుంటూ వెళ్తుండగా ముల్కల్ల శివారు ర్యాలీవాగు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని తెలిపారు. శశిపాల్‌కు భార్య ఒక కొడుకు ఉన్నారు. శశిపాల్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు గురువారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనా థ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గాదవేణి మల్లేష్, మునీర్ అహ్మద్, ఆసిఫాబాద్, రెబ్బెన, కెరమెరి మం డల అధ్యక్షులు చరణ్, రమేష్, కుసుంరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పీఈటీ గుండెపోటుతో మృతి

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రదీప్ భారతి (31) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ భారతి ఇటీవల నవోదయ విద్యాయలంలో జరిగిన క్రీడల అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల కోసం జట్టు ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా నవోదయకి వెళ్లింది. ఆ జట్టుకు ఆయన కోచ్‌గా వెళ్లారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డైనింగ్ హాల్‌లో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలియజేశారని ప్రిన్సిపాల్ రేపాల క్రిష్ణ తెలిపారు.

అధికారులకు అందజేయాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అధికారులకు ఇవ్వాల్సిన పీఆర్‌పీని వెంటనే అందించాలని అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. జీఎం కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మహేష్, ఎపెక్స్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏవీరెడ్డి, అన్ని గనులు, విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఉన్న కార్మికులను మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ చేసి వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర నాయకుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేకల రామన్న, కామెర్ల దేవయ్య. సంతోష్, బ్రహ్మానందం, సురేందర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

శ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అరుణక్కనగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమగ్ర వ్యాధి నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ పద్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్ఓ నాందేవ్ హాజరై ప్రజలతో మాట్లాడారు. అనంతరం హెచ్ఐవీ, హైపటైటీస్, మధుమేహం, రక్తపోటు, సిఫిలిస్ వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. క్షయ అనుమానితులకు తెమడ పరీక్షలు చేశారు. 34 మందిని ఎక్స్‌రే పరీక్షల కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగులు అభివృద్ధే లక్ష్యంగా పాటుపడాలి


అప్మెల్ కంపెనీని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మందమర్రిటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పరిశ్రమతో సింగరేణి సంస్థ సైతం పోటీ పడాలని, ఉద్యోగులు సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పాటుపడాలని ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయ వాడలోని సింగరేణికి సంబంధించి అప్మెల్ సంస్థను ఆయన సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్లతో కలిసి గురువారం సందర్శిం చారు. సంస్థను పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడి భాగాల మరమ్మత్తులు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు అప్మెల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని కొనియాడారు. ఒక నిబద్దత ప్రపంచంలో పోటీ పడగల అన్న ఆలోచన ఉన్న వ్యవస్థను సక్రమంగా వాడుకోవడం ఎలా అనే తపన ఉంటే చాలని మనం కూడా ప్రపంచంతో పోటీ పడగలమని తెలిపారు. ఈ సంస్థ ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సెల్‌టెంట్‌ను నియమిస్తామని, స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక అందిస్తామన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలనే ఆలోచన నిర్ణయం తీసుకుంటామన్నారు. సంస్థలో ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని, రంగులు వేయాలని, ఓవరాలింగ్ చేయాలన్నారు.సిబ్బంది భద్రత చర్యలు పాటించాన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని విస్మరించవద్దన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. అంతకుముందు అప్మెల్ మిషనరీలకు సంబంధించి సీఎండీ బలరాం ఉపముఖ్యమంత్రికి వివరించారు. కార్యక్రమంలో అప్మెల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి


కాసిపేట 2వ గనిపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

కాసిపేట, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అదిగమించేందుకు ప్రతి కార్మికుడు కృషి చేయాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. గురువారం కాసిపేట 2వ గనిపై నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంటల్ కమిటీ సమీక్ష సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. కంపెని యొక్క ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించేందుకు ప్రతి కార్మికుడు ప్రణాళికాబద్ధంగా నిబద్దతతో పని చేయాలని ఆయన కోరారు. ఓపెన్‌కాస్టు గనుల్లో సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమం ఫైనాన్స్ విషయాలను ఆయన కార్మికులకు వివరించారు. కార్మికులు తమ పనితనాన్ని మెరుగుపరుచుకొని లక్ష్య సాధన కోసం పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తిలక్ష్యాలను రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం విజయ ప్రసాద్, ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, కేకే గ్రూపు ఏజెంటు రాంబాబు, బాలాజీభగవతి, ఆర్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, శ్యాంసుందర్, కాసిపేట 2వ గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గ్రూపు ఇంజనీర్ రాంప్రసాద్, పిట్ సెక్రటరీ శ్రీనివాస్, సంక్షేమ అధికారి భార్గవ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

జైపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ పరిధికి సంబంధించి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనట్లు ఎస్టీపీపీ ఎగిక్యూటివ్ డైరెక్టర్ చిరంజీవి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా సీనియర్ అసిస్టెంట్ (స్టోర్ డిపార్ట్‌మెంట్) జోగు పర్శయ్యను సింగరేణి సీఎండీ బలరాం చేతుల మీదుగా కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. సివిల్ సూపర్ వైజర్ కుమురం శ్రీనివాస్ కోల్ క్వాలిటీ డిపార్టుమెంట్ క్లర్కు అమీనుల్లాలను వేడుకల్లో సన్మానించన్నామని తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సింగరేణి సమాచారం

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలి


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన ఆర్‌కే 5 గనిపై నిర్వహించిన మల్టిడిపార్ట్‌మెంటల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంస్థ స్థితిగతులను తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాను ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. సంస్థకు సంబంధించిన ప్రతి విషయం ఉద్యోగులకు తెలియజేయాలని సమావేశాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రవికుమార్, శ్రీధర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రిటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గురువారం స్థానిక జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు జాతీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్‌లు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు ప్రతి నెల ఇన్‌కంటాక్స్ రూపేణా లక్షలాది రూపాయలు కోత విధించడంతో ఆర్థిక భారం పడుతుందని, దీంతో కార్మికులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్‌ను యాజమాన్యమే చెల్లించాలన్నారు. అనంతరం జీఎం దేవేందర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంజనేయులు, నాయకులు సూర్యనారాయణ, కల్పన, సాంబయ్య, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించారు.

రోగులతో మాట్లాడి ఆరోగ్య కేంద్రంలో పొందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆదునీకరించి ప్రజలకు మెరుగైన వేగవంతమైన సేవలు అందిస్తామన్నారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాదులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వెంటనే వివరించాలని అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సమయ పాలన పాటించాలని తెలిపారు. అనం తరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి తరగతి గదులు మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాదులు వ్యాప్తి చెందకుండా విద్యార్థులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



పీహెచ్‌సీ వైద్యురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సంక్షిప్త సమాచారం

వేమనపల్లి : మండలంలోని నీల్వాయి గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలను గురువారం ఎంపీడీవో కుమారస్వామి తనిఖీ చేశారు. కిచెన్ రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట కేజీబీవీ ఎస్‌వో మయూరి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం సమీపంలో జైపూర్ వీవో వెన్నెల మహిళా సంఘం సభ్యులు ఏర్పాటు చేసుకున్న జాతీయజెండా గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. జాతీయ జెండా ఎగురవేయడానికి ఏర్పాటు చేసుకున్న గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని మహిళా సంఘం సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బెల్లంపల్లి: పట్టణంలోని ఆయావార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులను పర్యటించారు. వార్డు ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 18వ వార్డు కాంట్రాక్టర్ బస్తీలోని ప్రజలు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. కొలిపాక శ్రీనివాస్, తిరుపతి, చిరంజీవి, రవి, పాల్గొన్నారు.

హాజీపూర్: పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాపల్లి మండల పరిషత్ పాఠశాలలో మండలశాఖ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

నెన్నెల :ప్రభుత్వ నిషేధిత గంజాయి కలిగి ఉన్న కేసులో నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆవిడి ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారంతో బుధవారం దాడి చేసి మందిర్యాల గద్దెరాగడికి చెందిన పార్లెపు ప్రణయ్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి 150 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అజయ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు. ఇద్దరు పరారీలో ఉన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలో గురువారం రాత్రి బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 1947 ఆగస్టు 14న దేశాన్ని ముక్కలు చేసి పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనాగా విభజించిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వానిదని నాయకులు పేర్కొంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

మరమ్మతులు చేయండి

తాండూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ గ్రామంలోని కల్వర్టు, రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతూ గురువారం బెల్లంపల్లి ఏరియా జీఎంకు తుడుం దెబ్బ నాయకులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కల్వర్టులోని పైపులు కొట్టుకుపోవడంతో పాటు రోడ్డు అధ్వానంగా మారాయని తెలిపారు. కల్వర్టు పైపులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు, గ్రామస్తులు వర్కత్‌రావు, దిందర్‌షా, శ్యాంరావు, బాదిరావు, భొజ్జిరావు, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీకి తొత్తుగా మారిన ఎలక్షన్ కమిషన్

మంచిర్యాలక్రైం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి ఎలక్షన్ కమిషన్ తొత్తుగా వ్యవహరిస్తుందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గురువారం ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఓటు చోర్ గద్దె ఛోడ్(ఓట్ల దొంగలు గద్దె దిగండి) ఉద్యమంలో భాగంగా ఐబీ చౌరస్తా వద్ద క్యాండిల్ ర్యాలీ ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తత్తాను పలుకుతూ ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బీజేపీ గెలుపు లక్ష్యంగా ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తూ ఎలక్షన్ కమిషన్ నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బీజేపీకి అనుకూలంగా ఓట్లను నమోదు చేస్తూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు జాబితాల నుంచి ఓటర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఎలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలను చేపడుతామని సెప్టెంబర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన కో ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ కొట్నాక తిరుపతి, నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, తూముల నరేశ్, తాజా మాజీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట చెరువు కబ్జాకాకుండా చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామంలోని ఎర్రగుంట చెరువును కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎర్రగుంట చెరువును కబ్జాచేయడానికి చూస్తున్నారని సంబంధిత ఎరిగేషన్ అధికారులు పట్టించుకోవాలన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎర్రగుంట చెరువుకు గండికొట్టడంతో వందల ఎకరాలు పంట నష్టం వాటిల్లిందన్నారు. అలాగే మత్స్యకారులు సైతం చేపల పెంపకం చేపడుతున్నారని చెరువు గండి పడడంతో చేపపిల్లలు కొట్టుకుపోయాయన్నారు. ఎర్రగుంట చెరువును కబ్జా చేస్తున్నవారిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, మతిరాంసింగ్, గోగర్ల శంకర్, అంబాల మహేందర్, మల్లయ్యలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

భీమిని/కన్నెపల్లి ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని జైభీం పరస్పర సహకార సంఘంలో యూరియా బస్తాల కోసం గురువారం గ్రామంలోని రైతులు ఆం దోళన చేశారు. బుధవారం రాత్రి సొసైటీకి 266 బస్తాలతో వచ్చాయి. దీంతో గ్రామంలో రైతులు సొసైటీ వద్దకు చేరుకొని తమకు యూరియా బస్తాలు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ సొసైటీకి 4 లోడుల యూరియా బస్తాలు వచ్చినప్పటికీ గ్రామానికి చెందిన రైతులకు ఇవ్వడంలేదని అన్నారు. బ్లాక్ మార్కెట్‌లో సొసైటీ వారు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సొసైటీ వారిని రైతులు ప్రశ్నించడంతో పెస్టిసైడ్ పురుగుల మందులను కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తామని సొసైటీ వారు అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సొసైటీపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. యూరియా బస్తాలు ఇవ్వమంటూ సొసైటీ తాళాలు వేయడంతో రైతులు భీమిని ఏడీఏ సురేఖకు ఫోన్ చేయడంతో ఆ వ్యక్తికి చేరుకున్న ఏడీఏ సురేఖ, ఎస్సై భాస్కర్‌రావు రైతులకు నచ్చజెప్పి అందో ళన విరమించారు. యూరియా బస్తాలను సదరు సొసైటీ యజమానులు రూపాయలు 280 రూపాయలకు బదులుగా రూ. 350 ఇస్తేనే ఒక యూరియా బస్తా ఇస్తామంటూ ఏడీ ఏ ఎదుటనే రైతులపై సొసైటీ సభ్యులు రైతులతో వాగ్వాదానికి దిగారు. సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే సొసైటీ ద్వారా వచ్చిన యూరియా బస్తాలను విక్రయించాలని ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీసుల బందోబస్తుతో ఏడీఏ సురేఖ రైతులకు ఒక్కో బస్తాను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమిని ఏవో యమునా దుర్గ, రైతులు ఉన్నారు.





వెంకటాపూర్ లో సొసైటీ షాప్ వద్ద మాట్లాడుతున్న ఏడీఏ సురేఖ..చెన్నూర్‌మండలంలో క్యూలైన్‌లో ఉంచిన చెప్పులు

క్యూలైన్‌లో పాదరక్షలు

చెన్నూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారని సమాచారం మేరకు పట్టణం, మండలంలోని రైతులు యూరియా కోసం వచ్చి క్యూలో నిలబడ్డారు. వందలాది మంది రైతులు క్యూలో నిలబడడం, సంబంధిత అధికారులు వారికి టోకెన్లు జారీ చేయక పోవడంతో రైతులు తమ పాదరక్షలను క్యూలో పెట్టి అక్కడే పడిగాపులు కాశారు. ఒక్కో రైతుకు ఒక్క యూ రియా బస్తాను పంపిణీ చేయడంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తూ అధికారుల తీరును ఎండగట్టారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

వర్షం మిగిల్చిన నష్టం..

(5వ పేజీ తరువాయి)

మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లోని 1814 మంది రైతులకు సంబంధించిన 3713 ఎకరాల్లో మామిడి పంట నేలరాలింది. తాజాగా ఈ నెల 12న కురిసిన భారీ వర్షాలకు సైతం పెద్ద మొత్తంలో రైతులకు పంట రూపంలో నష్టం వాటిల్లింది.

పంట నష్టం చెల్లించేదెప్పుడు...?

అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల పరిహారం అందిస్తా మని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే మార్చి నుంచి మొదలుకొని మే నెల వరకు కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులకు జరిగిన నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి, సంబంధిత రిపోర్టును ప్రభుత్వానికి అందజేశారు. అయితే దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బాధిత రైతులకు పరిహారం అందజేయలేదు. మార్చి నుంచి మే వరకు జరిగిన నష్టం అధికారుల అంచనా ప్రకారం రూ. 3,50,63,200 ఉంటుంది. ఆ మొత్తం రైతుల ఖాతాల్లో జమ కావలసి ఉంది. తాజాగా జరిగిన నష్టం విలువ దాదాపు రూ. నాలుగున్నర కోట్ల వరకు ఉంటుందని అంచనా. పాత బకాయిలతో కలిపి తాజాగా జరిగిన నష్టం పరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని వినతి

తాండూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయపల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీల కాలనీల్లోకి నీరు వస్తుందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల తహసీల్దార్, ఎంపీడీవోకు కాలనీల ప్రజలు, మహిళలు వినతి పత్రం అందించారు. మహిళలు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎస్సీ ఎస్టీ కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయని తెలిపారు. పైన ఉన్న మామిడి తోటల నుంచి కూడా నీటి వరదలు వచ్చాయని, రైతులు ఒర్రెలను పూడ్చడంతో ఆ నీరు కూడా ఇళ్లలోకి వస్తుందన్నారు. జాతీయ రహదారి నిర్మాణం చేశారని, కానీ సరైన కాలువ నిర్మాణం చేయకపోవడంతో నీరు ఇళ్లలోకి వస్తున్నదన్నారు. ఇళ్లలో నీరు రాకుండా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మహిళలు,యువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నస్పూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మే కల దాసు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం తేడా లేకుండా పోయిందన్నారు. ఫేస్ క్యాప్చర్ విధానం ద్వారా అనేక సమస్యలు ఉత్పన్నమవుతు న్నాయన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని మేకల దాసు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రూ. 18వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనాలు, అదే విధంగా ఫేస్ క్యాప్చర్ విధానం రద్దు చేయాలన్నారు. ఈధర్నా కార్యక్రమంలో తేకల సరస్వతి, శంకరమ్మ, శారద, అరుణ, తిరుమల, పద్మ, రమా, సురేఖ, జబీందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ఎర్రవాగును పరిశీలించిన అధికారులు

నెన్నెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి దెబ్బతిన్న ఎర్రవాగు తాత్కాలిక వంతెనను అధికారులు, నాయకులు గురువారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో పక్కనుంచి తాత్కాలిక వంతెన నిర్మించారు. అది కాస్తా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో లంబాడితండ, మన్నెగూడెం, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట, కోనంపేట, కుర్మగూడెం ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు వాగు నుంచి దాటే పరిస్థితి లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైపులు వేసి తాత్కాలిక వంతెనను నిర్మించాలని, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, చెన్నోజు శంకరయ్య ఉన్నారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

లక్షెట్టిపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి జాడి రమేష్ అన్నారు. మున్సిపాలిటీలోని ఊత్కూర్‌లో గురువారం భవన, ఇతర నిర్మాణ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పని సమయం పెంచుతూ వచ్చిన జీవో 282ను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అందించాలని, ప్రతీ కార్మికుడికి 10లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ప్రతీ కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాతో పాటు మహా సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యుఎస్‌ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజనం అమలు చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించినట్లుగా కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. దీంతో కాలేజీల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కళాశాలల్లో మధ్యాహ్నభోజనం అమలు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కార్తికేయ, లక్ష్మణ్, లక్ష్మీశర్మ, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ మహా సభలను విజయవంతం చేయండి

కాసిపేట, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ కాసిపేట మండల కార్యదర్శి దాగాం మల్లేశ్ అన్నారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలను విజయవంతం చేసేందుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, విద్యావంతులు, విద్యార్థి సంఘం నాయకులు మహిళా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జాడి పోచం, కుర్సింగ హన్మంతు, పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న కార్యాలయాలు, విద్యాసంస్థలు

దండేపల్లి ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పంచాయతీ కార్యాలయాలతో పాటు, వ్యాపార, వాణిజ్యసంస్థలు, కుల సంఘాలు, పార్టీ నాయకులు జెండా పండుగ కోసం ముస్తాబు చేస్తున్నారు. రంగు రంగుల కాగితాలు, మామిడి తోరణాలు తయారు చేసి కార్యాలయం చుట్టూ ఏర్పాటు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి

దండేపల్లి ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాహితం, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత అని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి పేర్కొన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ సీపీ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ, ఏసీపీ పర్యవేక్షణలో దండేపల్లిలో గురువారం ఉదయం ఎస్సైలు పోలీసు సిబ్బందితో కలిసి నేరం నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ద్వారా ఇళ్లను సోదలు చేసి నిర్ధారణ తనిఖీలు చేపట్టి, స్థానిక ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ ప్రజలకు భద్రత భావం సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అసాంఘిక శక్తులకు అనుమానాస్పద వ్యక్తులకు ఎవరు ఆశ్రయం కల్పించవద్దన్నారు. ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, యువత యువకులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల మీ ఫోన్‌కాల్స్, మెసెజ్‌లకు మీరు స్పందించవద్దన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ప్రజలను నిత్యం భద్రతతో ఉంచడానికి పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సిర్ధారణ తనిఖీలో గ్రామంలోని 4 లీటర్ల నాటుసారాను పట్టుకొని, 36 బైక్‌లు, 3ఆటోలు స్వాధీనం పర్చుకొని దానికి సంబంధించి పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం ఎస్సైలు తైసినోద్దీన్, సురేష్, అనూష, రామన్న, సర్కిల్ పరిధిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ రమణమూర్తి, ఎస్సైలు

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

హాజీపూర్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఎంపీవోలు, ఎంపీడీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి అధికారుల తనిఖీలు, పంచాయతీ కార్యదర్శుల అటెండెన్స్, పౌర సేవలు, 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధుల వినియోగం ఆడిట్, గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు ఒక బస్తా అందించాలి

భీమిని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక రైతుకు ఒక బస్తా యూరియా అంద జేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చత్రునాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎరువుల గోదాం, కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోతాదుకు మించి ఎరువులు రైతులు వాడ వద్దని సూచించారు. ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన ఎరువుల నిలువలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఆయన వెంట ఏవో యమునాదుర్గ, సీఈవో సంగర్సు రాజేశ్వర్ రావులు ఉన్నారు.

వ్యక్తి మరణానికి కారణమైన ఇద్దరికి జైలు శిక్ష

కన్నెపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అడవి పందుల కోసం విద్యుత్ తీగలు అమర్చి వ్యక్తి మరణానికి కారణమైన ఇద్దరికి మంచిర్యాల అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి గురువారం ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించినట్లు కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. 2021 మార్చి 17న మేకల శంకర్ అడవి పందుల వేట కోసం అమర్చిన కరెంటు తీగలు తగిలి మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య శ్రీ కరెంటు తీగలు అమర్చిన అర్కల రమేష్, తండ్రి బాపుపై ఫిర్యాదు చేయడంతో కన్నెపల్లి అప్పటి ఎస్‌హెచ్‌వో రహీం కేసు నమోదు చేయగా తాండూర్ సీఐ బాబురావు దర్యాప్తు చేసి నేరస్తులపై కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. నిందితులు అర్కల రమేష్, తండ్రి బాపులను మంచిర్యాల కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నేరస్తులకు శిక్ష పడేలా చేసిన తాండూర్ సీఐ దేవయ్య, కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్‌రావు, కోర్టు కానిస్టేబుల్ గట్టయ్య, లైజన్ ఆఫీసర్ గోవింద్‌రావు, వెంకటేశ్వర్లును రామగుండం సీపీ అభినందించారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోండి

నస్పూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ రాయల్ టాకీస్ నుంచి షిర్కే చౌరస్తా వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నస్పూర్ కార్యదర్శి సందీప్ కమిషనర్ సంపత్ కుమార్‌కు గురువారం వినతి పత్రం అందించారు. లైట్లు వెలగకపోవడం మూలంగా ఆ రోడ్డుపై రాత్రి వేళ ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చెక్కులు అందజేత

నెన్నెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు మొదటి విడత బిల్లులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ నాయకులు గురువారం నెన్నెలలో ఇంటింటి తిరుగుతూ రూ. లక్ష చెక్కులను అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు రాజశేఖర్ ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

కాసిపేట,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు అమలు చేస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానంను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు గంప శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక భద్రత లోపించడం వలన ముప్పుగా పరిణమించిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయవర్గాల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకున్న యూనిఫైడ్ పెన్షన్‌స్కీం పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో ఉందన్నారు. దీనిని పీఆర్‌టీయూ తరుపున యూపీఎస్ పెన్షన్‌స్కీం విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

● జాతీయ జెండా ఆవిష్కరించనున్న హర్కర వేణుగోపాల్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధ మైంది. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో వేడుక ల కోసం ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్ర భుత్వ సలహా దారు హర్కర వేణుగోపాల్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ కు మార్ దీపక్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరణ, 9.45కు సందేశం, 10గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.35కు ప్రశంసా పత్రాల పంపిణీ, 11 గంటలకు స్టాల్స్ సం దర్శ, 11.30 గంటలకు వందన సమర్పణ ఉంటుం దన్నారు. కలెక్టరేట్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీ సర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో సభా వేదిక, వివిధ శాఖ లస్టాళ్లు ఏర్పాటు చేశారు. నీడకోసం టెంట్లు, కుర్చీ లు, పోలీసు కవాతు కోసం ఏర్పాట్లు చేశారు. అలా గే నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మార్కె ట్‌లో జాతీయ జెండాలను, బ్యాడ్జీలను ప్రజలు, వి ద్యార్థులు కొనుగోలు చేశారు.



కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

మృత్యువులోనూ వీడని స్నేహం...

● జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

● లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఇటిక్యాలలో విషాదం... 6

● మృతులు ఇటిక్యాలకు చెందిన యువకులు

పంటలను పరిశీలించిన సబ్ కలెక్టర్


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మనోజ్

భీమిని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో చెరువుల్లా మారిన భూములను బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ గురువారం సందర్శించారు. నీట మునిగిన వరిచేలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పొలాల్లో చేరిన వర్షపునీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపు కునే లా చూడాలని రైతులకు సూచించారు. రాబోయే రెండురోజు ల్లోను వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను, ఇళ్లను అంచనావేసి నివేదికను సమర్పిం చాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. అలాగే దెబ్బతిన్న పొలాలు, ఇళ్లను పరిశీ లించారు. కొంతమంది గ్రామస్తులు వాగుపై వంతెన వేసేందుకు చర్యలు తీసుకునేందుకు వారు ఆయనను కోరారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ ఈ విషయంపై తగు చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ బికర్ణ దాస్, ఏఈవో జంబుల కార్తీక్, పాల్గొన్నారు.

పాలగోరి భూములను సర్వే చేయాలి

జన్నారం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పాల గోరిగూడెం భూములను సర్వే చేయాలని కో రుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువా రం హాజీపూర్ తహసీల్దార్ రామ్మోహ న్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభం జనం మాట్లాడుతూ ఈనెల 9న పాలోరి గూడెం ఆదివాసీలను వారి భూముల నుంచి వెల్లగొ ట్టి వారిపై కేసులు పెట్టారని వెంటనే కవ్వా ల్ అభయారణ్యంలోని పాలగోరి గూడెంలో ని ఆదివాసీల భూములపై సర్వేలు చేపట్టి హద్దులు వేయాలన్నారు. ఈకార్య క్రమంలో మర్సకోల శంకర్, రోహిత్, వినయ్, అభిన య్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కు ధర్నాను విజయవంతం చేయాలి

హాజీపూర్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పీ ఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఇందిరాపార్కు వద్ద చేపట్టే ధర్నాను వి జయ వంతం చేయాలని పీఆర్‌టీయు నా యకులు కోరారు. గురువారం మండలం లోని రాపల్లి మండల పరిషత్ పాఠశాలలో మండలశాఖ ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్లు ఆ విష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయు టీఎస్ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకై చేస్తున్న పోరాటంలో ఉపాధ్యాయు లందరూ భాగ స్వాములు కావాలని కోరా రు. ఈ ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొని వి జయవంతం చేయాలని అన్నారు. ఈ కా ర్యక్రమంలో అధ్యక్షులు ఎస్.ఆనంద్‌రావు, జ నరల్ సెక్రటరీ శ్రావణ్‌కుమార్, సంఘం నా యకులు పాల్గొన్నారు.

సాలిగాంలో పర్యటించిన సబ్ కలెక్టర్

కన్నెపల్లి : మండలంలోని సాలిగాం గ్రా మంలో గురువారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పర్యటించారు. వర్షానికి గ్రామం లో ని పీపీరావు ప్రాజెక్టు బ్యాంక్ వాటర్‌తో ఇళ్ల లోకి నీరు చేరగా ఆయన ముంపు ప్రాం తాలను సందర్శించారు. అధి కారులకు పలు సూచనలు చేశారు. ముంపు బారిన పడ కుండా తమ సమస్యను పరిష్కరించానలి బాధితులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఆర్ఐచంద్రమౌళి, ప్రజలు ఉన్నారు.


వర్షం మిగిల్చిన నష్టం..

● జిల్లాలో మూడు వేల ఎకరాల్లో పంట నీళ్లపాలు

● నాట్ల దశలో వరి, పెరుగుదల దశలో పత్తికి నష్టం

● పూర్వపు పంట నష్టం చేతికందక రైతుల అవస్థలు

● జిల్లాలో రూ. 3.5 కోట్ల పరిహారం పెండింగ్



మంగళవారం కురిసిన వర్షానికి నెన్నెల మండలం నందులపల్లిలో పత్తి చేనులో చేరిన నీరు



మంచిర్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం కురిసిన భారీ వర్షాలు రైతులకు తీరని నష్టం మిగిల్చాయి. అల్పపీడన ప్రభావం, నైరుతి రుతు పవనాల కారణంగా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. భారీవర్షాల కారణంగా పెద్ద మొత్తంలో పంటలకు నష్టం వాటి ల్లింది. వర్షాల కారణంగా నాట్ల దశలో ఉన్న వరి వరదల్లో కొట్టుకుపోగా, ఏపుగా పెరుగుతున్న పత్తిపంట పూర్తిగా నీట ము నిగింది. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ ప్రారంభ మైన నాటి నుంచి మూడు దఫాలుగా వర్షాల కారణంగా పంటలు నీట మునగగా, రైతులకు అపార నష్టం వాటిల్లింది.

జిల్లాలో 3436 ఎకరాల పంట నీటిపాలు...

ఈ నెల 12న కురిసిన భారీ వర్షం కారణంగా జిల్లాలో 2138 మంది రైతులకు చెందిన 3436ఎకరాల్లో పంటలు నీటిపాల య్యాయి. వరిపంటకు సంబంధించి జిల్లాలోని కన్నెపల్లి, భీమి ని, నెన్నెల, వేమనపల్లి, తాండూరు మండలాల్లో 917 మంది రై తులకు చెందిన 1434ఎకరాలు నీట మునగగా, అవే మండ లా ల్లో 1221మంది రైతులకు చెందిన 2002 ఎకరాల పత్తి చేలలో నీరు నిలిచింది. ఈ కారణంగా నాట్ల దశలోనే వరి పంటకు తీ రని నష్టం వాటిల్లగా, పత్తి చెట్లు నీటిలో మునగడం వల్ల ఎం డిపోయే అవకాశాలు ఉన్నాయి. వర్షాల కారణంగా వరికి ఎక రాకు రూ. 10వేల చొప్పున రూ.కోటి 50లక్షల మేర నష్టం వాటిల్లగా, పత్తి పంటకు ఎకరాకు రూ. 15వేల చొప్పున మొత్తం మూడు కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు అంచనా.

నాలుగు సార్లు పంట నష్టం..

ఈ యేడు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ రకాల చేతికి వచ్చిన పంట లు నీటి పాలయ్యాయి. మూడు నెలల్లో ఏకంగా 2310 మందికి చెదిన 3505 ఎకరాల పంట నీట మునిగింది. మార్చి 21న కురిసిన వర్షం కారణంగా 162 మందికి చెందిన 120.17 ఎకరాల్లో పం టలకు నష్టం వాటిల్లగా, ఏప్రిల్ 13,14 తేదీల్లో భారీ వర్షాలకు 250 మంది రైతులకు చెందిన 199.23 ఎకరాలు, అలాగే ఏప్రిల్ 31 నుంచి మే 6వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాల కార ణంగా పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. ఆ వ ర్షాలకు జిల్లా వ్యాప్తంగా 1898 మంది రైతులకు చెందిన 3186.13 ఎకరాల పంట పూర్తిగా తుడిచి పెట్టుకు పోయింది. వరి పంటకు సం బంధించి నెన్నెల, భీమారం మండలాల్లో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లో 490 రైతులకు సంబంధించిన 862 ఎ కరాల్లో పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మొ త్తంగా 2 లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం నీటి పాలైనట్లు అంచనా. అలాగే మామిడి పంటకు సంబంధిం చి నెన్నెల, జైపూర్, భీమారం, బెల్లంపల్లి, తాండూరు, మందమర్రి...

- మిగతా 7లో

17న ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి) : లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైద్రాబాద్ శ్రీకర ఆసుపత్రి సహ కారంతో ఈ నెల 17న మంచిర్యాల పట్టణం లో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, ప్రోగ్రాం కో ఛైర్‌పర్సన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం క్లబ్ భవ నంలో శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడు తూ ఈ శిబిరంలో డాక్టర్ రాకేష్ కొమురవెల్లి పాల్గొని మోకాలి నొప్పి, తుంటి నొప్పి, ఇతర ఎముకల కీళ్ల సమస్యలకు సంబంధిం చి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అం దిస్తారన్నారు. పట్టణ, పరిసరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సభ్యులు సురేందర్, మధుసూద న్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ప్రక్షాళన చేయాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాక్రికెట్ అసోసియేషన్‌ను ప్రక్షాళన చేయాలని ఓల్డ్ మంచిర్యాల క్రికెట్ క్లబ్(ఓఎంసీసీ అధ్యక్షులు బొలి శెట్టి కిషన్ అన్నారు. గురువారం పట్టణంలోని శివాజీ గ్రౌండ్‌లో గురు క్రికెట్ అకాడమి ఆధ్వర్యంలో అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నరేశ్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు క్రీడల కోసం అన్ని వసతులతో స్టేడియం నిర్మాణంకు శ్రీకా రం చుట్టారన్నారు. అసోసియేషన్ అక్రమణలపై విచారణ చేయాలని డిమాం డ్ చేశారు. నిర్వాహకులు దుర్గప్రసాద్, విజయ్, వివేక్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం

● కలెక్టర్ కుమార్ దీపక్


తిలక్‌నగర్ చెరువులో సిబ్బందితో బోటులో పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ ఎఫ్‌డీఆర్

మంచిర్యాలక్రైం/కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వాతా వరణ సూచనల మేరకు రాబోయే అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజ రక్షణ కోసం అన్ని ఏర్పాట్లతో సి ద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మం చిర్యాల పట్టణం తిలక్‌నగర్ చెరువులో డీసీపీ భాస్కర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను ఎదుర్కొనేం దుకు ప్రజల రక్షణ కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్‌వేలు వాగులు, నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ పంచాయతీశాఖల అధికా రులు సమన్వయంతో పని చేయాల న్నారు. లోతట్టు ప్రాంతా ల్లో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి తగు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో వరద లకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 90మంది సభ్యులతో మూడు ఎఫ్‌డీఆర్ఎస్ బృందాలు జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజల రక్షణకు కావాల్సి న పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని పోలీసు అధికారులకు శిక్షణ అందించామన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధం గా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు మత్స్యకా రులు చేపలవేటకు వెళ్లకూడదని జిల్లాలోని పాఠశాలలకు గు రువారం సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలో ప్రాణనష్టం, ప శునష్టం, ఆస్తినష్టం జరుగకుండా సంబంధిత అధికారులు చ ర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటి స్తూ ప్రజల రక్షణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.